# రాజుగారి మంగలి

ఈమధ్య ఇండియానించీ అమెరికా వలస వచ్చిన కొందరితో మాట్లాడు తుంటే, రకరకాల కొత్త విషయాలు వినిపిస్తున్నాయి. అలాగే ఇండియనించీ వచ్చే కొన్ని వెబ్ పత్రికలలో అమెరికా గురించి కొన్ని విషయాలు వ్రాయటమేకాక, వాటి మీద చర్చలు కూడా ఆహ్వానిస్తున్నారు. అవన్నీ వింటుంటే, చదువుతుంటే మనం కబుర్లు చెప్పుకోటానికి అవి మంచి కబుర్లు అనిపించి, ఈసారి ఆ కబుర్లు చెబుతున్నాను.

చదువుకోవటానికి అమెరికా వచ్చాడు ఒక కుర్రాడు. ఒక పార్టీలో కలిశాను. అతని పేరు రాహిల్ లేదా రోహిల్... లాటిది. నేనెప్పుడూ వినని తెలుగేతర పేరు. అతని పేరేమైతే ఏమిటి గానీ, అతను చెప్పేవే వేరుగా వున్నాయి.

'మా యూనివర్సిటీ పక్కనే చాలమంది నీగ్రోలు వుంటున్నారు. అక్కడ అందరూ వాళ్ళే. అమెరికన్స్ అస్సలు కనిపించరు. అందుకే అనుకుంటాను, అక్కడ క్రైమ్ చాల ఎక్కువ' అన్నాడు.

అతన్ని వింతగా చూస్తూ 'ఎన్నాళ్ళయింది మీరు అమెరికా వచ్చి' అడిగాను.

అతను నన్నదోలా చూస్తూ 'ఒక సంవత్సరం దాటిపోయింది' అన్నాడు.

సాగరసంగమంలో కమల్ హాసన్ అన్నట్టుగా 'మీరు మూడు తప్పులు చేశారు' అన్నాను. ఈసారి అతను నన్ను వింతగా చూశాడు. అతని కళ్ళడుగు తున్నాయి, అవేమిటో వివరించండి అని.

నేను చిరునవ్వుతూనే అన్నాను. 'ఇక్కడ నల్లవాళ్ళని నీగ్రోలు అనకూడదు. అది చాల అభ్యంతరకరమైన మాట. ఆ మాట ఆనాటి బానిసత్వానికి చిహ్నం. ఇది మొదటిది. రెండోది, అందరూ వాళ్ళే, అమెరికన్స్ కనిపించరు అన్నారు. వాళ్ళు నాలుగైదు తరాల అమెరికన్స్. నాలా మొదటి తరం వాళ్ళూ కాదు. మీలాగా ఎఫ్ఫోబీ కాదు. తెల్లవాళ్ళెంత అమెరికన్సో నల్లవాళ్ళూ అంతే అమెరికన్స్. ఇక మూడోది, అమెరికాలోని గణాంకాలు చూస్తే జైళ్ళల్లో వున్న నల్లవాళ్ళ సంఖ్య తెల్లవాళ్ళ సంఖ్య కన్నా తక్కువే. కాకపోతే అదొక దురభిప్రాయం మాత్రమే'

అతను నేను చెప్పింది అర్థం చేసుకున్నాడో లేదో నాకు తెలీదుకానీ, వెంటనే అడిగేశాడు ఎఫ్ఫోబీ అంటే ఏమిటని.

అక్కడే కూర్చున్న నిర్మల అంది, 'అంటే ఫ్రెష్ ఆఫ్ ది బోట్ అని. ఇప్పుడే బోటు దిగి అమెరికా వచ్చారని. ఇక్కడ పుట్టి పెరిగినవాళ్ళు కొత్తగా వచ్చిన వాళ్ళ గురించి వాడే మాటది. కొత్తగా వచ్చిన వాళ్ళు ఇక్కడ పుట్టి పెరిగిన వాళ్ళని ఎబిసిడి అంటారే అలా అన్నమాట' అతను ఎబిసిడి అంటే ఏమిటి అని అడగలేదు, అమెరికన్ బార్న్ కన్‌ఫ్యూజ్డ్ దేశీ అని తెలిసే వుంటుంది.

మొన్నీ మధ్య ఇండియా వెళ్ళినప్పుడు, ఇద్దరు వ్యక్తుల్ని కలిశాను. ఇద్దరూ అమెరికాలో వున్న తమ పిల్లల దగ్గర ఐదారు నెలలు వుండివచ్చిన వారే.

'దేశమంటే అమెరికానేనండీ. అక్కడి రోడ్డులు, శుభ్రత, ఎంతో స్నేహంగా పలకరించే మనుష్యులు. నాకు బాగా నచ్చింది రోడ్డు మీద అన్ని వందల కార్లు వెడుతున్నా ఎంతో క్రమశిక్షణ. కనీసం ఒక్కడు కూడా హారన్ కొట్టడు. అదో పెద్ద విచిత్రం. మేమున్న ఐదు నెలలూ ఎంతో సరదాగా గడిపాం. బెస్ట్ టైం ఆఫ్ అవర్ లైఫ్' అన్నాడు ఎడ్డెం ఎంకట్నారాయణ.

'మేము అమెరికాలో వున్న ఆరు నెలలూ కారాగార శిక్ష అనుకోండి. బయటికి పోవటానికి వీల్లేదు. ఇంట్లో దేరీజ్ నో కాలక్షేపం. అక్కడి పేపర్లలో మన ఇండియా గురించి వ్రాయరు. టీవీలో మన దేశం గురించి చూపించరు. షాపులకి వెడితే మనం చెప్పేది వాళ్ళకి అర్థం కాదు. వాళ్ళు చెప్పేది మనకి అర్థం కాదు. అదో నరకం అనుకోండి' అంటాడు తెడ్డెం తిరుమ్మలావ్.

'అమెరికా భూతల స్వర్గమా కాదా' అనే విషయం మీద కూడా ఇంటర్నెట్లో కొన్ని చర్చలు చదివాను.

'అమెరికా భూతల స్వర్గం కాదు. అక్కడో ఇండియన్ని ఉద్యోగంలో అందరితో సమానంగా చూడకపోగా బాగా బాధ పెట్టారుట. ఉద్యోగంలోనించీ పీకేశారుట. అలాటి చోటు భూతల స్వర్గమెలా అవుతుంది' అంటాడు మిష్టర్ ఎ.

'అదేమీలేదుట. నువ్వు చెప్పే ఇండియన్‌కి ఈ భూతల స్వర్గంలో అందరిలో ఎలా మెలగాలో తెలీక తను ఇబ్బంది పడి అందరినీ ఇబ్బంది పెట్టి గోటితో పోయేది గొడ్డలితో నరికే దాకా తీసుకుపోతే మరేమవుతుంది. మన దేశంలో ఇంతకన్నా ఎక్కువ కుల మత ప్రాంతీయ ద్వేషాలు లేవూ' అంటాడు మిష్టర్ టి.

'ఒక పెట్రోల్ బంకులో మనవాళ్ళనిద్దరిని చంపేశారుట నల్ల అమెరికన్స్. అస్సలు శాంతి భద్రతలు లేవు' - ఎ.

'భలే చెప్పావే, బంగారం గొలుసులు వేసుకుని అర్థరాత్రి పెట్రోల్ బంక్‌లో వుంటే దొంగలకి టెంప్టింగ్‌గా వుండదూ మరి. మన దేశంలో జరిగే హింసాకాండ లకన్నా ఇవి చాల తక్కువ' అంటాడు టి.

'ఏమో అమెరికా భూతల స్వర్గం కాదు'

'ఏమో నాకు ఇండియా కన్నా అమెరికాలోనే సుఖంగా, క్షేమంగా వుంది'

నన్నొక సూరిగారు అడిగాడు నాలుగు నెలల క్రితం గుంటూరు వెళ్ళినప్పుడు. 'మీరు అన్నాళ్ళునించీ అమెరికాలో వుంటున్నారు కదా. మొహమాటం లేకుండా, నిజాయితీతో చెప్పండి. అమెరికా భూతల స్వర్గమా? కాదా?'

ఒక్క క్షణం ఆలోచించి అన్నాను. 'నా ఉద్దేశ్యంలో స్వర్గమూ నరకమూ అంటూ ఇక్కడో అక్కడో ఇంకెక్కడో లేవు. అవి మన ఆలోచనల్లోనే, మన మనసుల్లోనే వున్నాయి. అవి మనం మన చుట్టూ నిర్మించుకునేవే. ఉదాహరణకి మీ ఇటు పక్క ఇంట్లో వాళ్ళు ఎంతో సుఖంగా జీవితాన్ని స్వర్గంగా మలుచుకుంటూ వుండవచ్చు. అటు పక్క ఇంటివాళ్ళు రోజూ తిట్టుకుంటూ కొట్టుకుంటూ నరక ప్రాయం చేసుకుంటూ వుండవచ్చు. ఒక్క రోడ్డులో ఇంత పక్కపక్కనే స్వర్గం నరకం వున్నప్పుడు, దాన్ని దేశపరంగా చూడటంలో అర్థం లేదని నా అభిప్రాయం' అన్నాను.

నేను చెప్పిందాయనకి రుచించలేదని ఆయన ముఖం చూస్తేనే తెలుస్తున్నది. పైగా 'మరి ఎంకట్నారయణగారూ, తిరుమ్మలావుగారూ చూసింది ఒకే అమెరికా కదా, మరి వారి కథనాలలో తేడా ఎందుకు వచ్చింది' అని అడిగాడు.

ఆయన తెలివైన ప్రశ్నకి ఆలోచించకుండానే జవాబు దొరికింది. నా బాణీలో జవాబు చెప్పాను.

అనగా అనగా ఒక రాజుగారు. ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు వున్నారో లేదో, ఏడు చేపలు తెచ్చి ఎండ బెట్టారో లేదో నాకు తెలీదు కానీ, ఆ రాజుగారికి ఒక ఆస్థాన మంగలి మంగయ్య వుండేవాడు. అతను రోజూ ఉదయాన్నే రాజమందిరానికి వచ్చి రాజుగారికి గడ్డం గీస్తుండేవాడు. రాజుగారి మంగలి కనుక జీతం బత్తెం బాగానే కిడుతుండేవి. చాలమంది కన్నా కూడా కొంచెం పెద్ద అంతస్థులోనే బ్రతుకుతుండేవాడు.

గడ్డం గీస్తున్నప్పుడు రాజుగారు మంగయ్యని అడుగుతుండేవాడు, 'మంగయ్యా! మన రాజ్యంలో ప్రజలు ఎలా వున్నారురా' అని.

మంగయ్య, తను ఎంతో రంగరంగ వైభవంగా బ్రతుకుతున్నాడు కనుక, 'ఇక వేరే చెప్పాలా మహారాజా! ప్రతి పౌరుడి జీవితం మూరు పువ్వులూ ఆరు కాయలుగా ఎంతో సంతోషంగా సుఖంగా లక్ష్మీ కటాక్షంతో కళకళలాడుతున్నది. అంతా మీ దయ' అనేవాడు.

రాజుగారు సంతోషించి అతనికి బహుమతులు ఇచ్చేవాడు.

ఒక రాత్రి మంగయ్య ఇంట్లో దొంగలు పడి తట్టా బుట్టలే కాకుండా, బంగారం వెండీ, విలువైన వస్తు సామగ్రీ... ఒకటేమిటి సర్వం దోచేసుకుని పారిపోయారు.

మర్నాడు రాజుగారికి గడ్డం గీస్తున్నప్పుడు ఆయన రోజూ అడిగే ప్రశ్ననే అడిగాడు, 'మంగయ్యా! మనరాజ్యంలో ప్రజలు ఎలా వున్నారురా' అని.

దానికి సమాధానంగా మంగయ్య, 'ఏం చెప్పేది మహా ప్రభూ! రాజ్యంలో ఎక్కడ చూసినా దొంగతనాలూ, దోపిడీలు ఎక్కువయిపోయాయి. అరాచికం పెరిగి పోయింది. నిజాయితీ నమ్మకం నశించాయి... ' అంటూ తన గోడు చెప్పుకున్నాడు.

నేనీ చందమామ కథ ఎందుకు చెబుతున్నానా అని ఆలోచిస్తున్న సూరిగారు నావేపు సూటిగా చూశాడు.

ఆ చూపుకి నేనూ కొంచెం ఇబ్బంది పడుతూ, 'ఏంలేదు సూరిబాబుగారూ. ఎంకట్నారాయణగారూ తిరుమ్మలావుగారూ చెప్పిన మాటలు వింటే, ఏనాడో చందమామలో చదివిన ఈ చిన్న కథ గుర్తొచ్చి, మీకు చెప్పానంతే!' అని మాట దాటేశాను.

0 0 0